# ఈతచెట్లు ఊగుతు

## శృంగార కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

**ఇప్పచెట్లకు** పూత పట్టి, ఈత కల్లుకు పులుపెక్కి, తెగ తాగిన తుమ్మెదలు కైపెక్కి తులకించి తల లూపుతున్న తొలి కార్తెలో ఎగిరెగిరి తొక్కుడు బిళ్ళాడుతున్న చిలకమ్మ సైయంటూ సమర్తాడింది.

గుడిసె ముందు వసారాలో తడికె చాటున ముష్టి మండలు, ముంత నీళ్ళు పక్కన పెట్టుకుని నలుగు పెట్టించుకుంటూ, నువ్వుల చింబిలి చప్పరిస్తూ సోకులు పోతున్న కూతురు సొబగు చూచి చెంచమ్మ గుండె సంబరంతో చేటంతయింది.

పట్నానికి దూరంగా బస్తీకి ఎడంగా బాటకు అందకుండా ఇప్పచెట్లు ఈతవనాల చాటున దాగి నట్లున్న వో చిన్న గూడెం.

ఆ గూడెంలో ఆడా మగా జనంలో ఈతచెట్ల నడుమ తాటిమాను చందాన, ఇంత నోరూ కొంత పేరూ సంపాదించుకున్న ఆడమనిషి చెంచమ్మ.

మొదటి మొగుడు చెంచమ్మ చెర తప్పించుకుని పదేండ్ల కిందటే పారిపోయాడు. మారు మొగుడు మల్లేశు చెంచమ్మకు ఒక కొత్త కోక, కొంత పైకం ముట్ట జెప్పి చెల్లు చీటీ తీసుకుని మరో గూడానికి మకాం మార్చుకున్నాడు. ఇప్పుడు చెంచమ్మ మీసాలు లేని మగరాయుడిలా తివిగా కాలం గడుపుతూంది.

చెంచమ్మకు ఆ గూడెంలో వో గుడిసె ఉంది. గుడిసెలో తోడుగా వో కూతురుంది.

ఈ చెంచమ్మ కూతురే ఆ చిలకమ్మ.

దిబ్బ మీద దంటు కాడలా చకచకా పెరిగి, మజ్జిగ కుండలో వెన్న ముద్దలా ముద్దుగా తేరి, ఏపుగా ఎదిగి ఎగురుకొచ్చిన పిల్ల చిలకమ్మ. రెక్క లొచ్చిన చిలక చెట్లమీద ఎగరకుండా, చిగురుటాకులు మెక్కకుండా, జోడుకట్టి తిరక్కుండా అమ్మ కొంగు చాటున కిమ్మనకుండా ఉండమంటే ఉంటుందా!

నలుగు పెట్టించుకున్న నాల్గో వారం తిరక్క ముందే చిలకమ్మ తనకు ఈడుగల వాని జోడుకై గూడెం సందులో గులకరాళ్ళ డొంకలో ఈత తోపులో జోరుగా గంతు లేస్తూ పరుగులు పెట్టడం మొదలెట్టింది.

కూతురు కులుకు నడకలు, తళుకు చూపులు, పైట విసుర్లు చూస్తున్న చెంచమ్మకు, గుడ్డు కొచ్చిన పెట్ట కోడి గూడుమీద కెగిరి కొటకొట లాడడం గుర్తు కొస్తుంది. చిలకమ్మ తన చెయ్యి దాటి ఏ చెట్టు చిటారికొమ్మ మీదికో ఎగిరి పోతుందేమో అని దిగులు పడింది. సరైన బేరగాణ్ణి చూచి తన చేతుల మీదగానే చిలకమ్మకు పెండ్లి చేసెయ్యాలనుకుంది. తన కో తగువైన అల్లుడు కావాలంటూ చిన్నగా చాటు వేయించుకున్నది.

చక్కని చుక్క లాంటి చిలకమ్మను కట్టుకునేందుకు ఎందరో పెండ్లీడు కొడుకులు ముందుకు వచ్చినారు. ఇరుగు పొరుగు గూడేల నుంచీకూడా సంబంధాలు వచ్చినాయి. వొరి ఒకరు ఇంతిస్తా మంటే మరొకరు అంతిస్తా మంటూ పోటీలు పడ్డారు.

చెంచమ్మ ఇంటి కాడున్నా, కుంట కాడున్నా, కల్లు పాకలో ఉన్నా అల్లుళ్ళు కాదలిచిన అయ్యలు వక్క లాకులు చేత పట్టుకుని అమె కాళ్ళకు అడ్డం పడ్డారు. సాగిలపడి దండాలు తీశారు. బేరాలు పెట్టారు. చెంచమ్మను మెప్పించడానికి ఏమేమో చేశారు.

అయినా గుడిలోని గంగమ్మలా చెంచమ్మ ఎంతకూ ఉలకదు, పలకదు. ఎవరికీ మాటివ్వదు. వచ్చిన వారి వేడికోళ్ళు వింటూ, తెచ్చిన బేరాలు మనసులో బేరీజు వేసుకుంటూ కాలం గడిపింది. వచ్చిన సంబంధాలు ఒకొటిగా వెనక్కు వెళ్ళిపోయాయి..

ఏ సంబంధమైనా ఖరారు కావడానికి అసలుకు అమ్మా కూతుళ్ళు ఒక సమ్మతికి వస్తే కదా!

ఆ తల్లీ కూతుళ్ళు ఇప్ప సారాయి, ఈతకల్లు లాంటి వాళ్ళు. వాటి రంగులు వేరు. రుచులు వేరు. అదీ కారణం.

అమ్మ 'అవు'నన్న సంబంధం కూతురు కాదంటుంది. కూతురుకు ఇష్టమైన చోటు అమ్మకు ఒప్పు కోలు కాదు. ఆస్తి బాగా ఉండేవాణ్ణే అల్లుణ్ణి చేసుకోవాలని అమ్మ ఆశ.

జబ్బ పుష్టి దండిగా ఉండేవాణ్ణి జత చేసుకోవాలని కూతురు కోరిక. ఇద్దరూ ఒక మాటకూ, ఒక బాటకూ కలిసి రానందున చిలకమ్మ మోచేతి కున్న కంకణం ముంజేతికి రాలేదు. మూడు ముళ్ళూ పడలేదు.

రోజులు గడుస్తున్నాయ్.

ఎండలు ముదురుతున్నాయ్.

ఇప్పసారా వెనక్కు తగ్గి, ఈతకల్లు పూరేగుతున్న ఎండాకాలం.

ఆ గూడేనికి ఆనుకుని ఇప్ప తోటలో కల్లంగడి ఉంది.

అది గూడేనికి గుండెకాయ. గూడెం జనానికి ఆరో ప్రాణం లాంటిది.

ఆ జనానికి శాంతీ అశాంతీ, నీడా నిషా అన్నీ అక్కడే లభిస్తుంటాయి. ఇంకా చెప్పుకోవాలంటే మొత్తం గూడెం మందికి బడీ గుడీ, చావడీకూడా ఆ కల్లు పాకే.

తగవులు, తప్పులు, తీర్పులు, పెత్తనాలు, బేరాలు సారాలు అన్నీ ఆ కల్లు పాక చుట్టే తిరుగుతూ, తేరుతూ ఉంటాయి.

మండు టెండల్లో ఒక మధ్యాహ్నం...

ఆ ఎండలకు ఒక గుక్కెడు నీళ్ళు నోట్లో పోసుకుని గొంతు తడుపుకుందామని కల్లు అంగడికి వచ్చింది చెంచమ్మ. "పది రోజులుగా నీ పద్దు పెరిగి పోయింది. ఇంక ఒక చుక్కకూడా అప్పు పొయ్య" నన్నాడు వోబులయ్య. చెంచమ్మ నోరు చప్పరిస్తూ నిరాశతో నిట్టూరుస్తూ పక్కనే ఉన్న వో ఇప్పచెట్టు నీడలో కూలబడింది.

తాగాలని తపనగా ఉంది. అయినా చేతిలో చిల్లిగవ్వ లేదు. అక్కడా ఇక్కడా చెట్ల కింద ఆడా మగా గుత్తులు గుత్తులుగా చేరి ముంతలు ముందర పెట్టుకుని తమ లోకంలో తామున్నారు.

వో ఆడది! కడకు వో మగ వెధవయినా! తన





తట్టు తలెత్తి చూడలేదు. వో ముంత కల్లు పోయించిన పాపాన పోలేదు. చెంచమ్మ ఇప్పచెట్టుకు వీపు ఆనించి కాళ్ళు బారచాపి నీరసంగా ఆలోచిస్తూ కూర్చున్నది.

ఇంతలో ఆమె చూపు అప్పుడే కల్లుపాక నుండీ అటు పోతున్న జోగులమ్మ మీద పడింది.

మోకాళ్ళ దాకా వదులు వదులు కాషాయ రంగు జుబ్బా—నడినెత్తిన ఉంటగా ముడేసి కట్టిన రాగిరంగు జుట్టు—వో చేత్తో తంబుర, మరో చేత్తో కల్లు నింపిన సొరకాయ బుర్ర పట్టుకుని కలబంద డొంక గుండా ఎండలో కాళ్ళీడ్చుకుంటూ పోతున్న జోగులమ్మను చూచి నిట్టూర్చింది.

చెంచమ్మకు ఈలోగా మనసులో ఒక గట్టి కోరిక పుట్టింది—ఈ సంసార బంధాలు తప్పించుకుని తానూ జోగులమ్మగా మారిపోవాలని, రోజూ ముద్ద సంగటి, ముంత కల్లుకు పడే ఈ బాధలు తప్పుతాయని, ఏ ఇప్పచెట్టో, యేపచెట్టు కిందో కూచుని యేకతార అదే తంబుర వాయించుకుంటూ, బ్రహ్మంగారి పాటలు పాడుకుంటూ, వచ్చి కాళ్ళ మీద పడే భక్తుల దగ్గర కాసులు రాల్చుకుంటూ చీకూ చింతా లేకుండా కాలం గడిపేయాలని.

గుర్తు లేదు కానీ తన కిప్పుడు నాలుగు పదులు దాటినట్లే. ఇప్పటికే ఎన్నో చూచింది. చేసింది. అనుభవించింది. కట్టుకున్న వాని బంధం తెగిపోయింది. వూరు వచ్చిన వాని ముడి వీడిపోయింది.

నడుమ నడుమ దాపురించిన వాండ్లను నెత్తి మీద కెక్కించుకో లేదు. అన్ని బంధాలు తెంచుకున్నది. ఇంక కూతురు ఒకటే కాళ్ళకు అడ్డం. ఆ పిల్లను వో అయ్య చేతిలో పెట్టేస్తే సరి! అనక గుట్టమీద మఠంలో ఉండే అబ్బన్న బైరాగి దగ్గిర ఉపదేశం తీసుకుని యేకతార పట్టుకుని ఏకంగా జోగురాలై సుఖంగా ఉండి పోవచ్చు అనుకున్నది చెంచమ్మ.

# హాయ్!

ముంగర శంకరరాజు

ఇంతలో కొండ కింద పొదలపల్లెనుండి చిలకమ్మకు పెత్తనం మీద వచ్చిన, పెండ్లాము లేచిపోయిన కొండన్న చెంచమ్మను వెదుక్కుంటూ అక్కడికి వచ్చినాడు.

వస్తూనే బార చాపి ఉన్న చెంచమ్మ రెండు కాళ్ళు గట్టిగా పట్టేసి, 'నీ కూతుర్ని నా కివ్వ' మంటూ కదలకుండా కూచున్నాడు. కొండన్నది ఉడుం పట్టు. పట్టుకుంటే వదిలే రకం కాదు.

పొద్దు నడినెత్తి కెక్కింది. నిప్పులు రాలు తున్నాయ్.

కొండన్న చివుక్కున లేచినాడు. కల్లుపాకలో దూరి మూడు ముంతల కల్లు తెచ్చి, సాంగెం మోస్తరు నైవేద్యంగా ఆమె ముందు పెట్టినాడు.

"ఎండ అదర గొడతా ఉంది. కొంచెం ఒళ్ళు చల్ల చేసుకో, చెంచమ్మత్తా!" అన్నాడు వినయంగా.

ఆవురావురంటున్న చెంచమ్మ ఏకంగా రెండు ముంతల కల్లు కళ్ళు మూసుకుని గటగట తాగేసింది.

ఆమె మూతి తుడుచుకున్నంత లోపల కొండన్న రెండంగల్లో వెళ్ళి తీంట్రాకుల్లో కోడిచాకనా పట్టుకొచ్చి ఆమె ముందు పెట్టినాడు.

చెంచమ్మ మూడో ముంత ముచ్చటగా ముగించింది. కొండన్న నడుమ నడుమ చాకనా ముక్కలు ఆమె నోటి కందిస్తూ—

నన్నో ఇంటివాణ్ణి చెయ్యమన్నాడు. నా సంసారం నిలబెట్టమన్నాడు. నన్ను దిక్కు లేనోణ్ణిగా చావనియ్యొద్దన్నాడు. ఇంకా ఇదన్నాడు. అదన్నాడు. అల్లుణ్ణిగా చేసుకొమ్మన్నాడు. మళ్ళీ రెండు ముంతలు నింపు కొచ్చి ఆమె ముందు పెట్టాడు.

చెంచమ్మ నిండు కల్లు కుండలా తొణక్కుండా, నోరు మెదపకుండా నిమ్మళంగా కల్లు ముంత ఒకోటిగా ఖాళీ చేస్తూ కొండన్న వేడికోలు వింటూ కూచున్నది.

బురుగు బుస బుస పొంగుతున్న అయిదో ముంత ఆమె చేతి కందిస్తూ కడసారి ఖరారు మాటగా చెప్పాడు కొండన్న.

"సూడు, సెంచమ్మతా! నువ్వు గనక 'వో' అని ఒప్పుకుంటే చాలు! వక్కాకు యేసుకున్నంత సేపట్లో రంయిన పరుగు మీద పల్లె కెళ్ళి జత మేకలు, వో పొట్టేలు పిల్ల, వో పాడావు, పత్తూముల గట్టి గింజలు, రెండు కొత్త కోకలు, నాల్గు రయిగ్గుడ్డలు వొలిగా తెచ్చి నీ ఇంటి ముందర ఇప్పుడే కుంచసుగా పడేస్తా. నీ కూతురు సిలకమ్మను నాకు కట్టబెట్టు. పిల్లను పూలల్లో పెట్టి సూస్కుంటా. బాగా యెనకా ముందూ ఆలోసించు. నన్ను కనక అల్లుణ్ణిగా సేసుకున్నా వంటే వో పక్క నీకూ, ఇంకో పక్క నీ కూతురి పిల్లకూ వోగట్టే మగ దిక్కుగా ఉండిపోతా. కొండన్న మాట తప్పేమగాడు కాదని నువ్వే తెలుసు కుంటావు."

అంటూ కల్లు ముంత ముట్టుకుని ప్రమాణం చేసి చెప్పాడు. చెవికాడ జీరంగి మోతలా పదే పదే చెప్పాడు. మనసు కెక్కేట్లు చెప్పాడు.

అయిదో ముంత ఖాళీ చేసిన చెంచమ్మ అప్పటికి నెమ్మదిగా "ఆనందోబ్రహ్మ" లోకం అంచుకు చేరుకున్నది. ఆమె తనువు తూలుతూ, మనసు తేలుతూ ఉంది.

ఆమె చిన్నగా లేచి ఇప్పచెట్టు మీదికి ఎగిరింది. అక్కడ నుండీ ఇంకా ఎత్తుగా ఉన్న ఈతచెట్టు మీదికి, అక్కడ నుండి ఇంకా ఎత్తుగా ఉన్న తాటిమాను మీదికి దిరిసెన పువ్వులా అలా అలా ఎగురుతూ ఆమె ఆకాశంలోకి వెళ్ళింది. అక్కడంతా బయలు. ఆ బయలు నిండా మేఘాలు. గుములు గుములుగా ఉన్న ఆ మబ్బు దొంతర్లు తెల్లగా బురుగు బురుగ్గా, నురుగు నురుగ్గా ఉండి బుసబుస పొంగుతున్నాయి!

చెంచమ్మ చూచింది. ఆ నురుగు మడుగులో నిలబడి చిలకమ్మా, కొండన్నా దోసిళ్ళతో బురుగు ఎత్తి తలంబ్రాలు పోసుకుంటున్నారు. కిలకిల మంటూ ఒకరి మీద ఒకరు చల్లుకుంటున్నారు.

ఒక చోట ఆ నురుగు తుట్టె మీద చెంచమ్మ ఆసనం వేసి కూచున్నది. వో మబ్బు చాటునుంచీ ఆబ్బన్న బైరాగి చెయ్యి సాచి చెంచమ్మ చేతికి వో వెండి తంబుర అందించాడు. చెంచమ్మ కండ్లు మూసుకుని 'గురువేన్నమా!' అంటూ తంబుర మీటింది. అప్పుడు గురుబ్రహ్మ పోతులూరు


# తెలుగులో భారతీయ శిక్షా చట్టము




వెల రూ.15-75
పోస్టేజి రూ.3-25 అదనం

శిక్షకు గురి అయ్యే నేరములు ఏవి? 511 నేరములును, వాటికి విధించబడు శిక్షలును చట్ట వివరణములతో తేట తెనుగునందు విపులముగా వివరించబడిన పుస్తకము ఇది.

సామాన్యులకు, రక్షణాధికారులకు, న్యాయ శాస్త్రమును అభ్యసించు విద్యార్థులకు న్యాయవాదులకు, మిక్కిలి ఉపయోగపడు పుస్తకము ఇది.

భారతీయ శిక్షా స్మృతిని కూలంకషంగా తెలుసుకోగోరువారికి ఇదొక గొప్ప సదవకాశము.

DEVI PRASAD

BALAJI PUBLICATIONS
103, PYCROFTS ROAD MADRAS-600 014

వీరబ్రహ్మేంద్రస్వామి సాక్షాత్కరించి చెంచమ్మ నెత్తిన చెయ్యి పెట్టి దీవించినాడు. అంతే. చెంచమ్మ అక్కడినుండీ సరసరా జారి చెట్టు కిందికి వచ్చి కండ్లు తెరిచింది.

కొండన్న హనుమంతునిలా ఆరో ముంత నింపు కొచ్చి ఆమె ముందు నిలబడి ఉండాడు.

కొండమ్మ సంబరంగా కొండన్న చేతులు పట్టుకుని "చిలకమ్మను నీకే ఇచ్చి పెండ్లి చేస్తానయ్యా! అది కాదన్నా దాని కాళ్ళూ చేతులూ కట్టి పారేసి నీ చేతుల్లో పెట్టేస్తా. నా మాటకు తిరుగుండదు!" అని ఖరాఖండిగా చెప్పేసింది.

ఏ ఆకు రాలినా ఈతాకు రాలదు!

ఎంత వరపూడి మొక్కినా చెంచమ్మ వరమివ్వదు అని అనుకున్నాడు కొండన్న ఆదిలో. కానీ చెంచమ్మ చేతిలో చెయ్యేసి బిడ్డ నిస్తానని చెప్పినప్పుడు కొండెక్కి నంత సంతోషంతో కొండన్న చంకలు తట్టుకున్నాడు. పాదలపల్లెకు పరుగు పెట్టాడు.

కల్లుపాక నుంచీ చెంచమ్మ ఇంటికి వచ్చింది.

చిలకమ్మను పిలిచి చెంత కూర్చుండ బెట్టుకుంది.

కూడా తెచ్చిన కల్లు ముంత కూతురు నోటి కందించింది.

"పాదలపల్లె కొండన్నతో సంబంధం ఖరారు చేసుకొచ్చాను, పాపా!" అని చెప్పింది.

చిలకమ్మ చిర్రు బుర్రాడింది. ఈడెగిరి ఆడ దూకింది. తల్లిని ఛీ కొట్టి చేతిలో ఉన్న వట్టి ముంత నేలకేసి కొట్టింది.

"ముసలోడు. మూడో మనువోడు. మగతనం సచ్చినోడు. ఆ కొండ కింద పాదలపల్లె వో పారికి కొంప. ఆ గబ్బు కొంపకు నేను పో"నంది. మొండి కెత్తింది. మోకాళ్ళు ముడిచి కూర్చుంది.

చెంచమ్మ కూతురుకి కల్లు తాపించినట్లు కమ్మగా చెప్పింది మళ్ళీ.

"మూడో మనువోడంటూ అట్లా ముడిచి కూచుంటావేం. పిల్లా! వాడికేమే! మీసముండే మగరాయుడు. గూటం కొయ్యరా గట్టి గున్నాడు. ఇల్లుంది. ఇంటెనక ఈత తోపుంది. ఇంకా మడి ఉంది. మడక ఉంది. గొర్రెలుండాయ్. కోళ్ళుండాయ్. కట్టుకోవే, కూతురు పిల్లా! సుకపడతావ్" అంటూ అమ్మి గడ్డం పట్టుకుని అడుక్కున్నది అమ్మ.

"వాసెమ్మో !నువ్వు నూరు సెప్పు. ఇన్నూరు సెప్పు. నా మెడకు పొగ్గ మేసి పట్టేచ్చినా నే నా పాదలపల్లెకు పోను. కొండన్న మామతో కాపరం సెయ్యను."

అని బిర్ర బిగిసి మొరాయించిన కూతురి బిడ్డకు మనసు కక్కేటట్లు మళ్ళీ ఇట్లా చెప్పింది:

"మంచి తావు జూసే మాటిచ్చాను, పిల్లా! ఆ ఇంటి కాడ నీకు అత్తముండ ఆరడి ఉండదు. ఆడబిడ్డల అడ్డు ఉండదు. సవితి లంజె సాధింపు ఉండదు. కూచుండ బెట్టి కూడు పెట్టే అల్లుడు. సేతిలో ఉన్న సంగటి ముద్దలా అన్నీ అమిరొచ్చిన సంసారం. నీ సేతికి అడ్డూ, నీ కోరిక్కు కొదవా ఉండదు. నీ ఇంటికి నువ్వు రాణిగా ఉంటావు, అమ్మడూ!"

అని చెబుతూ చెంచమ్మ తల్లి అక్కడ కొంచెం ఆగి జాణతనం తొంగి చూస్తున్నట్లు నర్మంగా నవ్వు మొగం పెట్టి, వోర-చూపుల చూస్తూ—

"సీటికీ మాటికీ పాదరపల్లెంటే అట్లా అదిరి పడతా వెందుకే, అమ్మడూ! పాదలపల్లె సంగతి నీ కేం తెలుసునే, పిచ్చి మొగమా! పసందయిన తావుగదే అది. ఆ పల్లెకు ఈ పక్క ఈత వనాలు, ఆ పక్క ఇప్ప తోపులూ ఉండాయి. పల్లెకు నట్ట నడుమ వో పెద్ద పాడు గుడి ఉండాది. గుడి చుట్టూ గన్నేరు పొదలుండాయ్. వూరినిండా మనసు మెచ్చే మగరాయు ళ్ళుండారు. ఏ ఆడకూతురుకైనా అందివచ్చే చోటు గదే అది. మంచోడు. మెత్తనోడు. నిన్ను మెచ్చినోడు కొండన్న. అన్నిటికీ ఆయప్ప అండ దండ దండిగా ఉంటుంది."

అంటూ చెంచమ్మ పండొలిచినట్లు చెప్పింది. గడ్డం పట్టుకుని బతిమాలింది. కొసకు ఎట్లాగయితే నేం! కొండన్నను కట్టుకునేందుకు కూతుర్ని ఒప్పించింది.

అయిదో రోజు చెంచమ్మ ఇంటి ముందు పందిరి లేచింది.

ఒక పొట్టేలు, ఒక దుత్త సారాయి, రెండు కడవల కల్లు, ఒక తుడుము, మూడు తప్పెట్లు, నాలుగు దివిటీల హంగు, హంగామాతో అయినోళ్ళు అబ్బో అని ఆశ్చర్య పడేట్లు ఇంటి ముందు ఈతాకు పందిట్లో పెండ్లి సంబరంగా జరిపించేసింది చెంచమ్మ.

మూడో దినం కొత్త పెండ్లి కొడుకు కొండన్న అత్త కట్టించిన అత్తరసాల మూట కర్రకు తగిలించుకుని, కాళ్ళకు కిర్రు మెట్లు తొడుక్కుని, మగమారాజులా మీసం పురి పెట్టి, భుజం మీద ఎర్ర గుడ్డ కండువా ఎగరేసి, రిక్కా వేసి పెండ్లాన్ని తోలుకుని సొంతూరు పాదలపల్లెకు పయనమై పోయాడు.

•   •   •   •

చెంచమ్మకు కూతురు బరువు తొలగింది.

ఇప్పుడు ఏ బాదరబందీ లేని ఏకాకి.

గురు కటాక్షంతో తంబుర పట్టేందుకు ఇదే తరుణ మనుకున్నది. ఒక రోజు గుట్టమీద మఠంలో ఉన్న అబ్బన్న బైరాగి వద్దకు పోయింది.

"ఏం, చెంచులూ, బాగుండావా! శానాళ్ళకు ఇట్లా దారి తప్పి వచ్చావ్. రా, కూచో!" అరచేతిలో భంగు నలుపుకుంటూ ఆహ్వానించాడు అబ్బన్నసామి.

"బందాలన్నీ తెంపేసుకున్నా, అబ్బన్నస్వామీ. శిష్యురాలై ఉపదేశం తీసుకుందామని వచ్చా. ఇంక తంబుర పట్టుకుని రామా—కిష్టా—గోయిందా అనుకుంటూ అట్లా కాలం గడిపేయాలని ఉంది." చెప్పుకున్నది చెంచమ్మ.

"చెంచులూ! ఈ జీవికి జల్మ జల్మలుగా సుట్టుకొని ఉండే బందాలు వో రోజు తెంపితే తెగేటివి కాదు. జీవుడు ఈ దేహంతో సిక్కుకుని ఉండాడు. దేహం చుట్టూ మాయ అనే మురికి మడతలు మడతలుగా పేరుకుని ఉండాది. గురువు అనేవాడు ముందస్తుగా ఆ మడతల్ని తొలగించాల. అంటే మురికిని తోమెయ్యాల. ఒక రోజు కాదు— శానా రోజులు తోమాల. బాగా తోమాల. సరేలే, నిదానంగా అన్నీ నువ్వే తెలుసుకుంటావు. అడపా దడపా మఠానికి వస్తా ఉండు. సామికి సేవలు చేస్తా ఉండు. పొద్దు పొయ్యొచ్చావు. ఈ పూటకు ఈడే ఉండు. సాపాటు సేసి ఈ రేత్రికి ఈడే రామా—కిష్టా—గోయిందా అని పండుకుందువు కాని" అని సెలవిచ్చాడు స్వామి.

అయితే చెంచమ్మ ఆ రాత్రికి అక్కడే ఉండి ఆయనతో రామా—కిష్టా—గోయిందా అనుకోలేక పోయింది.

అప్పుడే మఠంలో అడుగు పెట్టిన జోగులమ్మ భుజం మీదున్న అన్నం కావిడి కిందపడేసి గుడ్లురిమి చూస్తూ స్వామి మీద విరుచుకు పడింది.

"ఏం బైరాగయ్యా! నే నొకదాన్ని ఏండ్లుగా నీ కాడ కుక్క మాదిరి పడి ఉండా. ఇప్పుడు రామా కిష్టా గోయిందా అనుకునేందుకు నీకు కొత్తగా మరోటి కావాల్సొచ్చిందా! నీ కడుపుకు కూడు మోస్తుండా: నీ గాంజా గుడంబాక్కు పైన అడుక్కొస్తుండా. నీ కాళ్ళు పిసుకుతుండా—రోజూ నీతో



## ముంగర శంకరరాజు

చిత్తూరు వాణ్ణి. ఉద్యోగం పూడిన ఉపాధ్యాయుణ్ణి. షష్టి పూర్తికి దగ్గరగా వచ్చిన వాణ్ణి. భార్య, నలుగురు పెద్ద బిడ్డలు. బాడుగింటి కాపురం. కవిగా సర్కారు వారు గుర్తించి ఇచ్చిన ఇంటి జాగా గల భాగ్యశాలిని.

'విపథగామి' తొలి నవలతో సీరియల్ రచయితగా నలభై ఏళ్ళ క్రితమే 'చిత్రగుప్త' ద్వారా రంగప్రవేశం చేశాను. 'రహింకూతురు' కథల సంపుటి 1958 లో శ్రీ జి. కృష్ణ ( ఆంధ్రప్రభ ) పీఠికతో వెలువడింది.

'రామచరిత మానస్" తులసీ రామాయణ మహాకావ్యానికి చేసిన వచనానువాదం 1962—63 లో ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. తి. తి. దే. వారు ఆ గ్రంధాన్ని సర్వ హక్కులతో తీసుకున్నారు. డబ్బు అయితే ఇచ్చారు కానీ, పుణ్యాత్ములు ఇంకా ప్రింటు చేయ లేదు. "రాజహంస చెప్పిన రమణీయగాధలు" ( అద్వితీయ బృహత్ శృంగార కథామాల ) 1973 లో వెలువడింది. "సీతాకోకచిలుక" గొలుసు నవల నేనూ, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, నూతలపాటి గంగాధరం కలిసి క్రమంగా రాసిన నవల. "కవులు చెప్పిన కథలు" 50 దాకా వ్రాశాను. అవి ప్రస్తుతం ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రికలో వరుసగా వస్తున్నాయి.

రామా కిష్టా గోయిందా అంటూ ఉండా. నీకు నేనేం తక్కువ చేశానని! ఈ రోజా నాకు పోటీగా ఇంకో దాన్ని రమ్మంటుండావ్!"

అంటూ జోగులమ్మ స్వామిని ఛెడామడా దులిపేసింది.

సామి తలొంచుకుని తడిసిన పిల్లిలా ముడుచుకు పోయాడు.

"ఇదుగో, సెంచక్కా! నువ్వు గురువు కావాలనుకుంటే మరోగణ్ణి చూసుకో! అంతేగానీ ఇంకెప్పుడూ ఈ మఠం తట్టు చూడొద్దు. గుట్ట మీద అడుగు పెట్టొద్దు" అని హెచ్చరించింది జోగులమ్మ.

చెంచమ్మ చేసేది లేక చేతులు పిసుక్కుంటూ తిరిగొచ్చేసింది.

"తంబుర పట్టాల—తత్త్వాలు పాడాల" అన్న ఆశ ఆ నాటితో అడుగంటింది ఆమెలో.

• • •

కార్తీకం—వైశాఖం రెండు కోతల కాలం గడిచిపోయింది. వోలి సొత్తు ఒకోటిగా కరిగి పోయింది. చెంచమ్మకు చేతులు ఖాళీ అయ్యాయి. బోలు పలుకుతున్న వోటి కుండలాంటి ఒంటరి బతుకు. వో ముద్ద సంగటీ, వో ముంతడు కల్లూకూడా కరువయ్యాయి. అగొట్టు కాలంలో చెంచమ్మకు అల్లుడూ, కూతురూ గుర్తు కొచ్చారు. ఇంటికి బీగం పెట్టి పాదలపల్లెకు పయనం కట్టింది.

పది బార్ల పొద్దు పై కొచ్చే వేళకు పాదలపల్లె చేరుకున్నది చెంచమ్మ. అల్లుని ఇంట్లో అడుగు పెట్టింది.

అది ఇల్లు ఇల్లుగా లేదు. మాసిన కుండా, చట్టీ, చెత్తా చెదారంతో చెడిన ఆడదిలా సంసారం చిందర వందరగా ఉంది. కూతురు వెలగ బెట్టిన కాపరం ఏరు కొట్టొచ్చినట్లు కనపడింది చెంచమ్మ కండ్లకు.

అల్లుడు కొండన్న ఏకాగ్గా పొయ్యి ముందు సాగిలో కూచుని చేతులు కాల్చుకుంటున్నాడు. చెంచమ్మ వెళ్ళి అల్లుని ముందు నిలబడింది.

అల్లుడు తలెత్తినాడు. అనాసక్తంగా అత్తను చూచినాడు. అతని మొగంలో ముందటి చేవ లేదు. చూపుల్లో చలనం లేదు. తల వంచుకుని తనలో తాను గొణుక్కుంటున్నట్లు అన్నాడు అత్తతో.

"నీ కూతురు ఏ నాడూ నా కిన్ని ఉడుకునీళ్ళు పెట్టి ఎరగదు. వేళ కింత సంగటి వండెయ్యదు. పండుకోను పక్క పరిచివ్వదు. కొంపలో కుదురుగా ఉండదు. మొగుడుండా డన్న మాటే మరిచిపోయింది. కోక కట్టి, కొప్పు దువ్వి పూలు తురిమి పల్లెమీద పడి కుర్ర నాయాండ్లతో చెడతిరుగుతూ ఉంటుంది. ఈ పాటికి ఇంటెనక ఈత తోపులో దొర్లుతూ ఉంటుంది. నువ్వు వచ్చినావు కాబట్టి, కొంప గోడు చూసినావు కాబట్టి, నాకు కట్టబెట్టిందానివి కాబట్టి వెళ్ళి నీ కూతురికి రెండు బుద్ధి మాటలైనా సెప్పి సూడు" అన్నాడు అల్లుడు. ఇంక ఈ కొంప బాగు పడే ఆశ లేనట్లు దీనంగా నిట్టూర్చుస్తూ.

అల్లుడు కొండన్న ఆకారం చూచీ, చిలకమ్మ తన్నేసిన సంసారం ఏరు చూచీ చెంచమ్మకు నిజంగా కమ్మలో కలబెట్టి నట్లయింది. గుండె గుబేలు

కొత్త సీరియల్
డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు రచన
'ధంసా'
నవల త్వరలో ప్రారంభం

మంది. కాళ్ళ కింద ఈత ముల్లు గుచ్చుకున్నట్టు అక్కడ నిలబడలేకపోయింది. పొంగి వస్తున్న కోపంతో బుస కొడుతూ, సరుక్కున వెనక్కు తిరిగి, కూతుర్ని వెదుక్కుంటూ వెళ్ళింది పల్లెకు పడమటి దిక్కుగా.

పల్లె వెనక డొంకలో, ఈతగుబులు కింద ఇసకలో కల్లు-కడవ పక్కన పెట్టుకుని, ఒళ్ళు పారేసుకున్నట్లు చేతులు బార జాపి, పరాకుగా పడి ఉన్న కూతురు వాలకం చూచి చెంచమ్మ నోరు బారగా తెరిచి ముక్కుమీద వేలేసుకున్నది.

"ఏమే, సిలకమ్మా! యెనకా ముందూ ఎవరూ లేనట్లు ఇట్లా తీరిపొయ్యావ్! సానిదానివి కాక సంసారి వైతివి. కులమూ, కొంపా ఉండే మగనాలివి, మరీ ఇంత బరి తెగించి తిరిగితే కట్టుకున్న మొగుడూ, కాలు పెట్టిన కాపరం ఏంగాను! మాంసం తింటాం గదాని యెముకలు మెళ్ళో ఏసుకుని తిరుగుతారా! దేనికైనా ఇంత గుట్టూ మట్టూ అంటూ ఉండొద్దా! కొండన్న కాపరం సూసి నా గుండె తరుక్కుపోయింది గదే!" అంటూ మంచిగానూ, మందలించినట్లుగానూ మాట్లాడింది చెంచమ్మ.

మత్తుగా తూలుతూ, మజ్జుగా తల ఆడిస్తూ, మందంగా నవ్వుతూ అమ్మ కూతురు చిలకమ్మ అప్పుడు అన్నది గదా!

"అమ్మో, సెంచమ్మా! ఇప్పు డీడ కొచ్చి ఎంత బాగా సెప్పావమ్మా! పసందైన ఈ పాదలపల్లెకు అనాడే నువ్వు నన్ను కట్టబెట్టావ్! ఈ నాడొచ్చి నువ్వు నన్ను సెడిపోయానంటుండావ్! నువ్వే సెప్పమ్మా నాయం! కల్లు కుండలో పడిన తుమ్మెదకు కైపు ఎక్కకుండా ఉంటుందా? సూడేయమ్మా! మొగుడు ముసలోడాయె. నేనో ఉమ్మసులో ఉన్న వయసుదాన్ని. పల్లె నిండా పాయంలో ఉన్న కుర్రకారు. ఆ పక్కా ఈ పక్కా ఈతవనాలు. పొద్దుటా మాపటా కోరినంత సద్ది కల్లు దొరుకుతుండె. కంది చేండ్లు కమ్మగా పూత కొచ్చిన కాలమాయె. ఇంగ సెప్పవేయమ్మా! నేను సెడకుండా ఎట్టా సావనే, తల్లీ!"

అంటూ చిలకమ్మ, గీత పడిన ఈతమాను బొట్లు బొట్లుగా కల్లు కార్చినట్లు, కనురెప్పలు తడి పొడిగా ఆడిస్తూ జిలిబిలిగా ఏడ్చినట్టు ఎక్కిళ్ళు పెడుతూ, చేతిలోని కల్లు ముంత అమ్మ చేతి కందిస్తూ తల్లి ఒడిలోకి ఒరిగిపోయింది.

చిలకమ్మ తన కన్న కూతురు. కడుపు పేగు తెంచుకుని పుట్టిన కనకండలాంటి బిడ్డ. ముద్దు మురిపెంతో పెంచి పెద్ద చేసింది. ఆ బిడ్డ కొచ్చిన ఇబ్బందులు చూచి చెంచమ్మ గుండె చెమ్మగిల్లింది. జాలి పుట్టుకొచ్చింది.

ఇల్లూ ఒళ్ళూ, ఇరుగూ పొరుగూ ఇంకా తెలుసుకోలేని యెర్రిబాగుల పిల్ల. ఎట్ల బట్టగట్టి బాగుపడుతుందో! అని వాపోతూ బిడ్డను అక్కున చేర్చుకుంది చెంచమ్మ. పైట చెరగు కల్లుతో తడిపి కూతురు కళ్ళు తుడిచింది. వోదార్పుగా బిడ్డకు వో ముంత కల్లు తాపింది. తాపం చల్లారేందుకు తానూ కొంత కడుపులో పోసుకుంది. చిలకమ్మను సందిట పొదివి పట్టుకొని పెద్దపొద్దు ఆలోచిస్తూ ఉండిపోయింది చెంచమ్మ—ఆ ఇసుక డొంకలో.

కూతురు పడు పాట్లు, అల్లుని అగచాట్లు, తన జరుగుబాట్లు అన్నీ ఆలోచించింది చెంచమ్మ. అన్నిటికి జవాబుగా వో అనుకూలమైన దారి కనిపెట్టింది.

చెంచమ్మ లేచింది. సందె చీకట్లు పడేవేళకు అక్కడ నుండి అల్లుని వద్దకు వచ్చింది.

పొంత బానలో నీళ్ళు కాగబెట్టింది. అల్లునికి వీపు రుద్ది ఉడుకునీళ్ళు పోసింది. సంగటి కెలికింది. ఉడుకుడుకు సంగటి ముద్దలు కొండన్నకు కడుపు నిండా పెట్టింది. వక్కలాకులు, వో పెద్ద పొగ మట్ట చేతి కిచ్చింది. పడుకోను పక్క పరిచిచ్చింది.

బయట చిటపటా చినుకులు పడుతున్నాయ్.

చలిచలిగా తెరలు తెరలుగా గాలి వీస్తూంది.

ఇంటి వెనుక ఈతచెట్లు వూగుతున్నాయ్.

ఎండిన ఈత మట్టలు ఒకటీ అరా రాలి కింద పడుతున్నాయ్.

చెంచమ్మ తానూ ఇంత తిని, కుండా చట్టీ యెత్తిపెట్టి, అల్లుని వద్దకు వచ్చింది. మడీ మడకా, మంచీ చెడ్డా — గురించి మాట్లాడుతూ పక్కన కూచున్నది.

వీపుకు వేడినీళ్ళూ, కడుపునిండా సంగటీ, పుక్కిట నిండా పొగాకు, మెత్తని పడకా, వెచ్చటి దుప్పటీ, సుఖం జీవితంలో తొలిసారిగా చూచిన కొండన్నకు ఆ రాత్రి గుర్రమెక్కినంత సంతోషమైంది.

ఆ నాటినుండీ అల్లునికి వో ఆడదిక్కుగా ఆ సంసారానికి వో పెద్ద అండగా, చిలకమ్మకు చిన్న చేయూతగా అత్త చెంచమ్మ అల్లుని ఇంట్లోనే ఉండిపోయింది. *